

సంగారెడ్డిలో భారీ వర్షం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో ఉదయం నుంచి పొడిగా ఉన్న వాతావరణం సాయంత్రం అయ్యే సరికి మబ్బులు అలుముకున్నాయి. సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు గంట సేపు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులపై వరద నీరు ప్రవహించి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



అందోలులో గురుకుల విద్యార్థినులతో మంత్రి దామోదర్ దంపతులు, పక్కన కలెక్టర్ క్రాంతి

అందోలులో అభివృద్ధి వరద

- ఏడాదిలోనే రూ.600 కోట్లు మంజూరు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందోలు నియోజకవర్గంలో అభివృద్ధి వరదలా సాగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఏడాది కాలంలోనే సుమారు రూ.600 కోట్ల నిధులను నియోజకవర్గానికే సాధించానన్నారు. గురువారం ఆయన అందోలు పట్టణంలో నర్సింగ్ కాలేజీ భవనం, దానికి అనుబంధంగా 100 పడకల ఆస్పత్రి, 50 పడకల ఎంసీహెచ్, విద్యార్థినుల కోసం హాస్టల్ భవనాల నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పనిచేసినప్పుడు జేఎన్టీయూ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్‌తోపాటు మొత్తం మూడు పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశానన్నారు. జోగిపేటకు మహిళా డిగ్రీ కాలేజీని, పీజీ సెంటర్‌ను సాధించానన్నారు. ఇప్పుడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా మొదటి రోజే తాను అందోలుకు 60 సీట్లతో కూడిన నర్సింగ్ కాలేజీని సాధించానన్నారు. అనుబంధంగా అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఒక 100 పడకల ఆస్పత్రిని, విద్యార్థినులు ఉండేందుకు హాస్టల్‌ను నిర్మిస్తున్నామన్నారు. 50 పడకల మదర్‌చైల్డ్ కేర్ సెంటర్(ఎంసీహెచ్)ను కూడా మంజూరు చేశానన్నారు. ఈసారి హెల్త్, మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నానన్నారు. చైల్డ్ హెల్త్ కేర్ సెంటర్‌లో యాంటీ నాటల్ చెకప్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నర్సింగ్ కాలేజీని ప్రస్తుతం పీజీ కళాశాల కోసం నిర్మించిన భవనంలో తాత్కాలికంగా ప్రారంభిస్తున్నమని, వచ్చే ఏడాది నాటికి సొంత భవనంతోపాటు, విద్యార్థినులకు హాస్టల్ భవన నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తామన్నారు. అంతేగాకుండా వచ్చే ఏడాది నాటికి 100 పడకల సూపర్ స్పెషాలిటీ, 50 పడకల ఎంసీహెచ్‌లకు నూతన భవనాలనిర్మాణాలను కూడా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. అందోలులోనే ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అందోలు పట్టణంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీ విద్యార్థినుల మంత్రి దామోదర్ రాజనర్సింహ తన జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, కలెక్టర్ క్రాంతి వల్లూరి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, ఆర్డీవో పాండు, జోగిపేట, రాయికోడ్ మార్కెట్ కమిటీల చైర్మన్లు మక్త జగన్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ మేతరి ప్రవీణ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్, ఎంపీ సురేశ్ షెట్కార్


మహిళా శక్తి పథకంతో ఆర్థికంగా బలోపేతం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం ఆయన మహిళా క్యాంటీన్‌ను ప్రారంభించి, అనంతరం మాట్లాడారు. మహిళా స్వాలంబనాన్ని పెంచి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించడమే ప్రధాన లక్ష్యమని, మహిళా శక్తి కింద మహిళా సంఘాలకు ఈ క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. మహిళా సంఘాలకు రూ.650.20 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, మహిళా అభివృద్ధి శాఖ పీడీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలెక్టరేట్‌లో కేక్‌ను కట్ చేయించారు.

ఊరిస్తున్న ఆశలు

ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు !

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ ఒక కొలిక్కి వచ్చినట్లుగా తెలుస్తున్నది. ఈ నెలాఖరులోగా కులగణనను పూర్తిచేసి వచ్చే నెలలో నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇదే జరిగితే ఫిబ్రవరిలోనే గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కొలువుదీరుతారు. గడిచిన జనవరి నెలలోనే పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ రిజర్వేషన్లతోపాటు ఇతర అంశాల కారణంగా వాయిదా వేస్తున్నారు. ప్రత్యేకాధికారులను నియమించి పంచాయతీల్లో పాలన సాగిస్తున్నారు. తాజాగా సర్కారు నుంచి సంకేతాలు రావడంతో మళ్లీ ఆశావహులంతా తెరమీదకు వచ్చారు.



- ఈ నెలాఖరు వరకు పూర్తికానున్న కులగణన
- రిజర్వేషన్లకు తొలగనున్న ఆటంకాలు
- మళ్లీ తెరమీదకొస్తున్న సర్పంచ్ ఆశావహులు
- పట్టణాలకు సమీపంలోని గ్రామాల్లో పోటాపోటీ
- అధికారుల పాలనలో పల్లెలు అస్తవ్యస్తం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, డిసెంబరు 5 : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పంచాయతీ ఎన్నికలు ఊరిస్తున్నాయి. ఎలాగైనా ఈసారి సర్పంచ్ పదవి దక్కించుకోవాలని ఆరాటపడుతున్న వారికి దాదాపు ఏడాది కాలంగా వేచిచూస్తున్నారు. ప్రస్తుతం కొత్త గ్రామపంచాయతీలకు కూడా ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉండడంతో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల సంఖ్య పెరగనున్నది.

ఖర్చులు ఫుల్లు.. జేబుకు చిల్లు

సర్పంచ్‌గా బరిలో ఉందామని ఆశిస్తున్న చాలామంది ఏడాదిన్నర కాలంగా రకరకాల ఖర్చులు పెట్టాల్సి వస్తోంది. 2024 జనవరిలోనే పంచాయతీ ఎన్నికలు జరుగుతాయనే క్రమంలో ఆరు నెలల ముందు నుంచే ఆశావహులు తెరమీదకు వచ్చారు. అప్పటి నుంచి నేటి దాకా ఖర్చులు పెడుతూనే ఉన్నారు. కొందరేమో ఆచితూచి వ్యవహరిస్తుండగా ఇంకొందరు పోటాపోటీగా ఖర్చు చేస్తూ జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. 2023 వినాయక చవితి సందర్భంగా విగ్రహాల దాతలు, అదే ఏడాది దుర్గామాత విగ్రహ దాతలుగా ఉన్నారు. మళ్లీ ఈ ఏడాది కూడా వినాయక, అమ్మవారి నవరాత్రులకు సహకరిస్తూ వచ్చారు. ఇవే కాకుండా గ్రామాల్లో శుభ, అశుభ కార్యాలకు తమవంతు సహాయం కూడా అందిస్తున్నారు. ఇతర దేవుళ్ల, దేవతల ఆలయాలకు, బొడ్రాయి ప్రతిష్ఠలకు ఆర్థికపరంగా ముందు నిలవక తప్పడం లేదు. ఇవన్నీ ఒకెత్తయితే పల్లెల్లోని పెద్దమనుషులు, కుల సంఘాల ప్రతినిధులు, ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులకు తాయిలాలతోపాటు విందులు ఇస్తున్న పరిస్థితులు పలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి.

ఈ గ్రామాల్లో పోటాపోటీ

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల, హత్నూర, కంది, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ మండలాల్లోని గ్రామాల్లో తీవ్రమైన పోటీ కనిపిస్తోంది. మెదక్ జిల్లాలోని తూప్రాన్, మనోహరబాద్, మెదక్, రామాయంపేట, నర్సాపూర్, మాసాయిపేట, చేగుంట మండలాలు, సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, ములుగు, వర్గల్, సిద్దిపేట అర్బన్, మర్కుక్, కొండపాక, కుకునూరుపల్లి, జగదేవ్‌పూర్, హుస్నాబాద్ మండలాల్లోని అనేక గ్రామాల్లో పోటీ ఎక్కువగా నెలకొంది. ఈ గ్రామాలు పట్టణాలకు సమీపంలో ఉండడమే గాకుండా రియల్ ఎస్టేట్, పారిశ్రామికపరంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇలాంటి గ్రామాల్లో విజయం సాధిస్తే పేరుతోపాటు ఆర్థికంగానూ పుంజుకోవచ్చని కొంతమంది యోచిస్తున్నారు. అందుకే ఖర్చుకు

మిగతా 5వ పేజీలో

జిల్లా	గ్రామపంచాయతీలు	వార్డులు
సంగారెడ్డి	646	5,718
సిద్దిపేట	514	4,566
మెదక్	491	4,232

ఆర్టీసీకి అద్దె బస్సుల అదురు

- మెదక్ డిపోలో సగం హైర్ బస్సులే
- తగ్గుతున్న సొంత బస్సులు
- ఆందోళనలో సంస్థ ఉద్యోగులు

5

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

- మెదక్ జిల్లాలో 1.25 లక్షల కుటుంబాలకు జీరో బిల్లు
- రూ.23 కోట్లతో 8 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్

4

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల పోరుబాట

5

- నేటి నుంచి రిలే దీక్ష, నిరవధిక సమ్మెలు
- సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరు

పెద్దచెరువు ముంపు బాధితుల సమస్యను

సీఎం దృష్టికి తీసుకెళతాం

- నిపుణుల కమిటీ నేతృత్వంలో ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తాం
- బాధితులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్

పటాన్‌చెరు, డిసెంబరు 5, (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చారు. గురువారం ముంపు బాధితుల జేఏసీ నాయకులు ఆయను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా బాధితులు తాము కొనుగోలు చేసిన ప్లాట్ల వివరాలను కమిషనర్‌కు అందజేశారు. ఇరిగేషన్ ఇంజనీర్లు చేసిన తప్పిదానికి తాము బలిపశువులమయ్యామని, ఐదువేల కుటుంబాలకు చెందిన ప్లాట్లు జలమయం కావడంతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తంచేశారు. రికార్డుల్లో ఉన్నట్లుగా 93.15 ఎకరాలకు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తే న్యాయం జరుగుతుందని హైడ్రా కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారితో కమిషనర్ మాట్లాడుతూ 9న సీఎంతో చెరువులపై జరిగే సమీక్షా సమావేశంలో అమీన్‌పూర్ ముంపు బాధితుల సమస్యను వివరిస్తానన్నారు. వాస్తవ ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. శిథిలమైన తూము, కాల్వలను పునరుద్ధరించి నీటిని వదిలే ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు ఆక్రమణలు, డ్రైనేజీ నీటికి అడ్డుకట్ట వేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జేఏసీ చైర్మన్ చిరునామా సత్యనారాయణ, నాగభూషన్‌రావు, సుబ్రమ్మణ్యం, విజయ్‌కుమార్, పీర్‌మహ్మద్, సత్యమూర్తి, రమేష్, ఎంటీ.నాయక్, కృష్ణకుమార్, ప్రతాప్ తదితరులున్నారు.



హైడ్రా కమిషనర్‌ను కలిసిన పెద్దచెరువు ముంపు బాధితుల జేఏసీ



నర్సాపూర్‌లో రోడ్డు బైఠాయించిన సునీతారెడ్డి, దహనం చేస్తున్న సీఎం దిష్టిబొమ్మ

ఏడాది పాలనపై ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?

- హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలి
- ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్
- నర్సాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

నర్సాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను ఎందుకు అమలు చేయలేదని, ఏడాది పాలనపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రశ్నించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం నర్సాపూర్ పట్టణంలోని జాతీయ రహదారిపై చౌరస్తాలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతును నొక్కేయాలని, దౌర్జన్యాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రశ్నించే హక్కు ప్రతీ ఒక్కరికి ఉందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఏడాదైనా హామీని నిలబెట్టుకోలేని అసమర్థ పాలన రాష్ట్రంలో సాగుతుందని ఆమె మండిపడ్డారు. దీనిని ప్రశ్నిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావుపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. అరెస్టు చేసిన హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పోలీసులకు పక్షపాతధోరణి తగదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మండల

మిగతా 6వ పేజీలో

న్యూస్ బాక్స్

జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్ ఓపీ సేవలు షురూ


సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్‌లో గురువారం నుంచి ఓపీ సేవలు ప్రారంభమయ్యాయి. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మైత్రి క్లినిక్‌ను వర్చువల్‌గా ప్రారంభించగా, కలెక్టర్ క్రాంతి ఇక్కడ ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలిరోజు ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఓపీ నమోదు చేసుకోగా వారి ఆరోగ్య సమస్యలకు వైద్యులు సలహాలు, సూచనలు ఇచ్చారు. క్లినిక్‌లో ప్రత్యేకంగా కేటాయించిన వైద్యులు డా.ఫాజుల్లా, నర్సింగ్ అధికారి సురేశ్ వచ్చిన వారికి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళ, సఖి సీఏ కల్పన, పవనరేఖ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లింగం, ఆర్ఎంవో డా.వీరాంజనేయులు, డా.రవి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జీజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్న ట్రాన్స్‌జెండర్లు

కోహీర్‌లో కమ్మేసిన పొగ మంచు





కోహీర్‌తో మండలంలోని బిలాల్‌పూర్, కవేలి, దిగ్వాల్ తదితర గ్రామాల్లో గురువారం ఉదయం పొగమంచు కమ్ముకున్నది. దీంతో వాహనదారులు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని 65వ జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తొమ్మిది గంటలకు మంచు పొరలు తొలగలేదు.

- కోహీర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి)

పాన్‌మక్తా భూముల్లో ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పటాన్‌చెరు, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): 'రద్దు చేసిన ఓఆర్‌సీలతో మాయ, బొమ్మన్‌కుంట పాన్‌మక్తా భూముల్లో పాగా' శీర్షికతో ఈ నెల 1వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. భూముల కబ్జా వ్యవహారంపై రెవెన్యూ అధికారులపై ఉన్నతస్థాయి నుంచి ఒత్తిడి రావడంతో ఆగమేఘాల మీద వివాదాస్పద భూముల్లో వేసిన ప్లాట్ల హద్దు రాళ్లు, సుమారు 25 ఎకరాల చుట్టూ వేసిన రేకుల ఫెన్సింగ్‌ను తొలగించారు. అమీన్‌పూర్ మండలం బొమ్మన్‌కుంట గ్రామంలోని ఈ వివాదాస్పద భూముల్లో సుమారు 20 ఎకరాల్లో ప్లాట్లు విక్రయించేందుకు హద్దురాళ్లను పాతి, రోడ్లు, గదులు నిర్మిస్తున్నా ఇంతవరకు ఎవరిపైనా కేసులు నమోదు చేయకపోవడం గమనార్హం. మెడికల్ డివైజ్ పార్కును అనుకుని సుమారు రూ.వంద కోట్ల విలువైన 25ఎకరాల స్థలం చుట్టూ ఎవరు ఫెన్సింగ్ వేశారన్నది చిదంబర రహస్యంగా మారింది. రేకుల ఫెన్సింగ్‌లు తొలగిస్తున్నా అటువైపు ఎవరూ రాకకపోవడం గమనార్హం. అయితే, ఆక్రమణలను దగ్గరుండి తొలగిస్తున్న అమీన్‌పూర్ తహసీల్దార్‌కు ఓ మంత్రి అనుచరుడినని చెప్పుకునే నాయకుడు పదేపదే ఫోన్లు చేసి ఫెన్సింగ్, లేఅవుట్ హద్దు రాళ్లు తొలగించవద్దని ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది. కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద పాన్‌మక్తా ఈనాం భూములకు ఈ మధ్య అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు జరుగుతున్న ప్రచారంపై 'ఆంధ్రజ్యోతి' తహసీల్దార్ రాధను ప్రశ్నించగా, ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగలేదని స్పష్టం చేశారు.



రేకుల ఫెన్సింగ్ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మొరుండ.. రుచి నిండా..!

- నారాయణఖేడ్ స్పెషల్ స్వీట్
- చెరకు పాకంతో తయారీ
- సీజన్‌లో మాత్రమే అమ్మకాలు


విక్రయానికి సిద్ధంగా ఉన్న మొరుండలు


నారాయణఖేడ్‌లో విక్రయిస్తున్న మొరుండలు

నారాయణఖేడ్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొరుండ.. ఈ పేరు.. అసలు అదేమిటో ఎవరికీ తెలియకపోవచ్చు. కానీ, నారాయణఖేడ్ వాసులకు మాత్రం ఆ పేరు వినగానే నోరూరుతుంది. చెరకు సీజన్‌లో మాత్రమే లభించే మొరండ లడ్డూలనూ ఇక్కడి వారు విపరీతంగా ఇష్టపడుతారు. చెరకు రసం.. ఇతర వస్తువులతో కలిపి తయారు చేసే ఈ మొరుండలు ఒక్కో షాపులో రోజుకు సుమారు 50 కిలోల వరకు అమ్ముడు పోతాయంటే వీటి క్రేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే, నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే ఇవి మార్కెట్‌లో లభ్యమవుతాయి. ఈ సీజన్‌లో ఎవరింటికైనా వెళ్తే మొరుండలనే తీసుకెళ్తారు. ఎవరైనా ఖేడ్‌కు వస్తే వీటిని కొనకుండా ఉండలేరు.

కర్ణాటకలో తయారీ..

నారాయణఖేడ్ వాసుల నోటిని తీపి చేసే ఈ మొరుండలు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ప్రాంతంలో తయారవుతాయి. ఖేడ్ ప్రాంతం బీదర్ జిల్లాకు సరిహద్దులో ఉండటంతో వ్యాపారులు మొరుండలను ఆర్డర్ ఇచ్చి మరీ తయారు చేయించుకుని తీసుకువచ్చి విక్రయిస్తారు. చెరుకు రసంతో పాటు పుట్నాల పొడి, శనగపిండి మిశ్రమాన్ని కలిపి మొరుండ లడ్డూలను తయారు చేస్తారు. కొబ్బరిపొడి, గసాలు, నువ్వులను గార్నిష్‌గా వాడుతారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఇప్పుడు డ్రైఫ్రూట్ మొరుండలూ తయారు చేసున్నారు. నెయ్యి, కాజు, బాదం, కిస్మిస్, పిస్తాలను జోడించి.. కొత్త రుచులను అద్దుతున్నారు.

ధర తక్కువే..

సాధారణ మొరుండ లడ్డూలను ఖేడ్‌లో కిలో రూ.120కి విక్రయిస్తుండగా, డ్రైఫ్రూట్ మొరుండలు కిలో రూ. 240కే విక్రయిస్తున్నారు. సాధారణ మొరుండ కిలోకు 16 పీస్‌ల వరకు వస్తాయి. డ్రైఫ్రూట్ అయితే కిలోకు 5 తూగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. చెరుకు రసంతో తయారు చేయడం వల్ల మధుమేహులు సైతం వీటిని తినేందుకు ఆసక్తి చూపుతారని అంటున్నారు.

రోజూ 50 కేజీలు అమ్ముతాం

మొరుండ లడ్డూలు చెరుకు సీజన్‌లో మాత్రమే లభిస్తాయి. నేను రోజుకూ 50 కిలోల వరకు అమ్ముతాను. కర్ణాటకలోని బీదర్ నుంచి తీసుకువస్తా. గతంలో సాధారణ మొరుండలే అమ్మేవాడిని.. ఇప్పుడు డ్రైఫ్రూట్ మొరుండాలూ అమ్ముతున్నా..

దత్తాత్రి, వ్యాపారి

అందరూ ఇష్టంగా తింటారు.

చలికాలం.. చెరుకు సీజన్‌లో లభించే మొరుండలను చిన్నా.. పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఇష్టంగా తింటారు. నోరూరించే ఈ మొరుండల సీజన్ ప్రారంభం కాగానే కచ్చితంగా కొనుగోలు చేస్తా.. నాతో పాటు మా బంధువులకూ ఇస్తా..

- బీరప్ప, ఫూసల్‌పాడ్

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం


మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్

- మెదక్ జిల్లాలో 1.25 లక్షల కుటుంబాలకు జీరో బిల్లు
- 1.03 లక్షల రైతులకు ఉచిత కరెంట్
- రూ.23 కోట్లతో 8 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్

మెదక్ అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యమని ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్ అన్నారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 3,52,386 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, మార్చి నుంచి నెలకు 200 యూనిట్లలోపు కరెంట్ వినియోగిస్తున్న 1,25,939 మంది పేద కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద రూ.31.36 కోట్ల జీరో బిల్లును పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 1,03,519 మంది వ్యవసాయ వినియోగదారులకు రూ.92.72 కోట్ల ఉచిత విద్యుత్ అందించామన్నారు. అలాగే 19,766 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రూ.3.15 కోట్లు, 3350 మంది నాయీబ్రాహ్మణులు, రజకులకు రూ.3.22 కోట్ల సబ్సిడీ ఇచ్చామన్నారు. తొమ్మిది నెలల్లో దాదాపు రూ.132 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం అందించిందన్నారు. సమ్మర్ యాక్షన్ కోసం రూ.18.19 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. 10 పవర్ ట్రాన్స్‌ఫార్మాలతోపాటు 107 ట్రాన్స్‌ఫార్మాలను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.23 కోట్లతో కొత్తగా మెదక్, చల్మేడ, బాలనగర్, వెంకటాయిపల్లి, చండూర్, మహ్మద్‌నగర్, మిర్జాపల్లిలో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టున్నామని, ఇప్పటికే గొల్లపల్లిలో సబ్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి రానున్న వేసవిలో నిరంతర నాణ్యమైన కరెంటును సరఫరా చేస్తామన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా శుక్రవారం సర్కిల్ కార్యాలయ ఆవరణలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సరైన పత్రాలతో వినియోగదారులు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డీఈ టెక్నికల్ శ్రీనివాస్‌విజయ్, అధికారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

- మద్యం మత్తులో ఘటన


ఎరుపుల నర్సింహులు(ఫైల్)

రాయపోల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతిచెందాడు. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన ఎరుపుల నర్సింహులు(41) కొన్నిరోజుల నుంచి ఏ పనీ చేయకుండా మద్యానికి అలవాటుపడ్డాడు. తరచూ తాగొచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. ఈ విషయం గమనించిన గ్రామస్థుడు పొలం పనులకు వెళ్లిన నర్సింహులు భార్యకు తెలిపాడు. ఆమె హుటాహుటిన ఇంటికి వచ్చి ఏమైందని భర్తను అడగ్గా.. ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగానని తెలిపాడు. వెంటనే ఆయనను గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక..


అస్మిత(ఫైల్)

మద్దూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక చికిత్స పొందుతూ మృతిచెందింది. మద్దూరు మండలం లద్నూరు గ్రామానికి చెందిన చిలువేరు నర్సింహులు పెద్దకూతురు అస్మిత(14) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా, మూడు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం కన్నుమూసింది. కాగా యువతి ఆత్మహత్యకు సంబంధించిన కారణాలు తెలియరాలేదు.

నర్సంపల్లిలో యువకుడి ఆత్మహత్య

తూప్రాన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన తునికి శివ(25) తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. కాగా శివ దివ్యాంగురాలైన సోదరితో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తూప్రాన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, విచారణ చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


దూదేకుల ఖాసీం (ఫైల్)

రేగోడు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన రేగోడు మండలం గజవాడ గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ పోచయ్య వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూదేకుల ఖాసీం(25) పాపన్నపేట మండలంలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. డిసెంబరు 27న హైదరాబాద్‌లో సమావేశం ఉన్నదని, రావడానికి మూడురోజులు పడుతుందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈనెల 2 నుంచి ఫోన్ స్విచాఫ్ అని రావడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఖాసీం తల్లి జలఖాన్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి


మృతిచెందిన పాడి గేదె

నారాయణఖేడ్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందింది. నారాయణఖేడ్ మండల పరిధిలోని కసన్‌నాయక్ తండాకు చెందిన బుజ్జీబాయి గురువారం పశుగ్రాసం కోసం పశువులను పొలాలకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ఎర్తింగ్ తీగకు గేదె తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, జీవనాధారంగా బతుకుతున్న గేదె మృతిచెందడంతో తీవ్రంగా నష్టపోయామని, పరిహారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'పది' ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- విద్యార్థులకు డీఈవో వెంకటేశ్వర్లు సూచన


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

మునిపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని అంతారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంబంధించిన సిలబస్, ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కాగా మండల పరిధిలోని బుదేరా ఉర్దూ, తెలుగు మీడియం ప్రైమరీ స్కూళ్లను గురువారం ఎంఈవో బీంసింగ్ తనిఖీ చేసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డీఈవో వెంట హెచ్ఎం సయ్యద్ సాబేర్ అలీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

అడవులను కాపాడుకోవాలి: అంబర్‌సింగ్


అడవుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంబర్‌సింగ్

చేగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలు జరగకుండా అడవులను రక్షించాల్సిన అవసరం ఉందని తూప్రాన్ ఫారెస్టు రేంజ్ అధికారి అంబర్ సింగ్ అన్నారు. చేగుంట మండలం వడియారంలోని అర్బన్ పార్క్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఎక్కువగా ఆకులురాల్చే అడవులు ఉన్నాయని, గొర్రెకాపరులు అడవుల్లో బీడీలు తాగుతూ పడేస్తారని, దీంతో అగ్ని ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే అటవీశాఖ అధికారులకు, లేదా 100కు డయల్ చేయాలన్నారు. అగ్ని ప్రమాదాల వల్ల అనేక జీవరాసులు నశించే అవకాశం ఉన్నదని చెప్పారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని పేర్కొన్నారు. ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం అర్బన్‌పార్కులో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మంటలు ఎలా నివారించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చేగుంట ఫారెస్టు సెక్షన్ అధికారి కిరణ్‌కుమార్, బీట్ అధికారులు రవి, మమత పాల్గొన్నారు.

పోతులబొగుడలో తాగునీటి ఎద్దడి

- నెలరోజులుగా 'మిషన్ భగీరథ' బంద్


పోతులబొగుడలో నీటి కోసం పోటీపడుతున్న గ్రామస్థులు

శివ్వంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతులబొగుడలో తాగునీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నెలరోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపు దగ్గర అందరం ఒకేసారి గంటల తరబడి వేచి ఉంటున్నామని చెప్పారు. నీటి సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

8 నుంచి దత్తాత్రేయ జయంతి

- ఆశ్రమ పీఠాధిపతి అవదూత గిరి మహరాజ్


దత్తాత్రేయ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8 నుంచి 17వ తేదీవరకు దత్తాత్రేయ జయంతిని నిర్వహించనున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి, 108 వైరాగ్య శిఖామణి అవదూత గిరి మహరాజ్ తెలిపారు. కాగా జిల్లా ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో నిర్వహించే దత్తాత్రేయ జయంతికి సంబంధించిన పోస్టర్‌ను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి క్రాంతి ఆవిష్కరించారు. ఇందులో భాగంతో దత్తాత్రేయ యజ్ఞం, చండీయాగంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గిరి మహరాజ్ పేర్కొన్నారు. ఈ వేడుకలకు రావాలని కలెక్టర్‌ను పీఠాధిపతి ఆహ్వానించారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి


పర్వతాపూర్‌లో ఏర్పాటుచేసిన కొత్త పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీఎల్పీవో అమృత

జహీరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి అమృత పేర్కొన్నారు. గురువారం మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లితండా, పర్వతాపూర్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. అందులో భాగంగా ఆయా గ్రామపంచాయతీల్లో పల్లె ప్రకృతివనాలు, పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. పల్లె ప్రకృతివనాలు ఎండిపోకుండా చూసుకోవాలన్నారు. పంచాయతీల్లో ప్రజలు పరిశుభ్రతను పాటించేలా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని కార్యదర్శి సంగయ్యస్వామికి సూచనలు చేశారు. అలాగే పర్వతాపూర్‌లో నూతనంగా ఏర్పాటైన పోలింగ్‌బూత్‌ను, అక్కడ ఉండాల్సిన సౌకర్యాలను డీఎల్పీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో సంజీవ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సరిగ్గా తిందాం..!

ఆహారం - ఆరోగ్యం

- ఆరోగ్యంగా ఉందాం..
- ఈ సీజన్‌లో విటమిన్ సీ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి
- బాదం లాంటి గింజలూ ఆరోగ్యానికి మంచివే
- సూప్‌లకూ స్థానం కల్పించాలంటున్న పోషకాహార నిపుణులు



చలి పెరిగింది.. వాతావరణంలో ఏర్పడిన మార్పువల్ల కూడా ఉదయం వర్షపు జల్లులు, మబ్బులు కమ్ముకొని ఉంటోంది. దీనివల్ల సీజనల్ వ్యాధులతో పాటు జలుబు, దగ్గు బారిన పడుతున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఈ శీతాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు మనం తినే ఆహారంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) సాధారణంగా శీతాకాలంలో చాలా మందికి ఆకలి మందగిస్తుందనే చెప్పొచ్చు. మసాలాలు ఉండే వంటకాలను తీసుకోవడానికి ఎక్కువమంది ఆసక్తి చూపుతుంటారు. కానీ, శీతాకాలంలో ఆరోగ్యం మెరుగుపడాలంటే కూరగాయలు, ఆకుకూరలతో పాటుగా సూప్‌లు, పెరుగు, సీజనల్ పండ్లు లాంటివి ఎక్కువగా తీసుకోవాలని పోషకాహార నిపుణురాలు సబీనా తెలిపారు. మసాలాలు, వేయించిన ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. ఉదయం అల్పాహారంగా జావ లేదా పాయసం తీసుకుంటే మంచిది. లేదా పండ్లు, బాదం గింజలు లాంటివి తీసుకుంటే శరీరానికి పోషకాలు కూడా లభిస్తాయి.

రోగ నిరోధక శక్తి మెరుగు కోసం..

శీతాకాలంలో రోగ నిరోధకశక్తిని మెరుగుపరుచుకోవడం చాలా ముఖ్యం. విద్యార్థులు, ఉద్యోగులు తప్పక పాటించాలి. జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి.. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

వెచ్చదనం కోసం..

శీతాకాలంలో ఆరోగ్యంతో పాటు మన శరీరానికి వేడిని కలిగించే పదార్థాలను తీసుకోవాలి. ఖర్జూరాలు, నువ్వులు, పాలు, మాంసం, చేపలు తినడంవల్ల ఆరోగ్యానికి మంచిది. వేర్లతో కూడిన కూరగాయలు బంగాళదుంప, క్యారెట్, ఉల్లిపాయ, వెల్లుల్లి, అల్లం, ముల్లంగి, చిలకడ దుంప లాంటివి కూడా తీసుకోవచ్చు. చల్లని కాలంలో శరీరం వెచ్చగా ఉండడానికి నియాసిన్ అధికంగా ఉన్న పదార్థాలను తీసుకోవచ్చు. గుడ్లు, పాలు, వెన్న, పెరుగు, మజ్జిగలో నియాసిన్ అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులను ఎదుర్కోవాలంటే..

సీజనల్ అంటువ్యాధులతో పోరాడేశక్తి కావాలంటే జింక్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. బచ్చలికూరలో జింక్ సహా పలు రకాల విటమిన్‌లు అధికంగా ఉంటాయి. ఇవి గాక గుమ్మడి విత్తనాలు, నువ్వులు, చేపలు, చికెన్, గుడ్లలో కూడా జింక్‌అధికంగా లభిస్తుంది

విటమిన్ సీ అధికంగా ఉన్న పండ్లు తీసుకోవాలి..

శీతాకాలం రాగానే జలుబు, దగ్గు, జ్వరం లాంటి సీజనల్ వ్యాధులతో పాటుగా ఫ్లూ కూడా పెరిగే అవకాశం ఉంది. విటమిన్ సీ, బీటా కెరోటిన్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకుంటే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. క్యాబేజీ, గుమ్మడి, దానిమ్మ, బత్తాయి, ఉసిరి, రేగు, స్ట్రాబెర్రీ లాంటి వాటిలో ఈ విటమిన్స్ అధికంగా ఉంటాయి. ఈ సీజన్‌లో కారెట్, బొప్పాయి తింటే మంచిది. ఆకు కూరలు తీసుకోవటం వల్ల ఐరన్ సహా శరీరానికి అవసరమైన విటమిన్స్ అధికంగా లభిస్తాయి.

సూప్‌లు తీసుకోవాల్సిందే..

శీతాకాలంలో ఎలాంటి సూప్‌లు తీసుకోవాలంటే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్న పుదీనా లాంటి హెర్బ్స్‌తో పాటు వెజిటేబుల్ సూప్స్ తీసుకోవచ్చు. వాటికి కాస్త పసుపు, వెల్లుల్లి, మిరియాలు తప్పనిసరిగా జోడించాలి.

నీరు తప్పనిసరి..

ఏ సీజన్‌లో అయినా మంచి నీరు ఎక్కువగా తీసుకుంటే చర్మం కాంతివంతంగా ఉండడంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. కీరా లాంటివి తీసుకుంటే కొంతమేరకు శరీరానికి అవసరమైన నీటిని భర్తీ చేసుకునే అవకాశం ఉంది.

ఊరిస్తున్న ఆశలు



మూడో పేజీ తరువాయి

వెనుకాడకుండా దూసుకెళ్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో ఇప్పటికే రూ.50లక్షల నుంచి రూ.కోటి దాకా ఖర్చు పెట్టినవాళ్లు కూడా ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

రిజర్వేషన్లపైనా డైలమా

2019లో నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో పదేళ్ల పాటు రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కులగణన తర్వాతనే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు వర్తింపజేయాలంటే ఇంటింటి సర్వే అవసరమని భావించి ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఇటీవలే సర్వే సైతం పూర్తయ్యింది. ఇక గ్రామాల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, మైనార్టీ వర్గాల జనాభా తేలనున్నది. మహిళల సంఖ్యపైనా స్పష్టత రానున్నది. ఈ సర్వే ఫలితాల ప్రకారమే రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రభుత్వం పూనుకుంటోంది. అందుకే ఇప్పటి దాకా గ్రామాల్లో ఖర్చు చేసిన వారంతా రిజర్వేషన్లపై డైలామాతో ఉన్నారు. తాము ఎడాపెడా ఖర్చులు పెట్టిన తర్వాత రిజర్వేషన్లు మారితే నిండా మునగాల్సి వస్తుందని అంటున్నారు. అందుకే తాము బరిలో ఉంటున్నామనే విషయాన్ని కూడా గోప్యంగానే ఉంచుతున్నారు.

అస్తవ్యస్తంగా పల్లెలు

గడిచిన 10 నెలల కాలంగా ఇటు కార్యదర్శులు, అటు ప్రత్యేకాధికారులు గ్రామాలను పర్యవేక్షిస్తున్నారు. చాలా చోట్లా ఇద్దరి నడుమ సమన్వయ లోపం కనిపిస్తున్నది. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే కావడంలో అభిప్రాయ భేదాలు తలెత్తుతున్న పరిస్థితి నెలకొన్నది. దీనికి తోడు ప్రత్యేకాధికారులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే చర్చ జరుగుతోంది. గ్రామ అవసరాలకు నిధుల కొరత ఉండడంతో కార్యదర్శులు సైతం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గ్రామాలకు పెద్దదిక్కు లేకపోవడం వల్ల అస్తవ్యస్త పరిస్థితులు దాపురించాయని ప్రజలే అంటున్నారు. త్వరగా ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పదవుల్లోకి వస్తారని, పల్లెలపై పర్యవేక్షణ కానవస్తుందని కోరుతున్నారు.



మెదక్‌లోని ఆర్టీసీ డిపో



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న మెదక్ బస్టాండ్

ఆర్టీసీకి అద్దె బస్సుల అదురు

- మెదక్ డిపోలో సగం హైర్‌వే..
- అద్దె బస్సులు 55.. సంస్థ బస్సులు 53
- తగ్గుతున్న సొంత బస్సులు
- ఆందోళనలో ఉద్యోగులు

మెదక్ అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అదిఘనత వహించిన టీఎస్ ఆర్టీసీ సంస్థ. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసే సంస్థగా ప్రసిద్ధిగాంచింది. నిత్యం వేలాదిమంది ప్రయాణికులను బస్సుల ద్వారా వివిధ ప్రాంతాలకు చేరవేస్తూ.. విశ్వాసాన్ని చూరగొంది. అయితే కొన్నాళ్ల నుంచి ప్రజా రవాణా వ్యవస్థలో ప్రైవేటు ఆజమాయిషీ పెరుగుతోంది. సొంత బస్సుల కంటే ప్రైవేటు హైర్ బస్సులు(పీహెచ్‌బీ) సంఖ్య పెరుగుతుండడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతుంది. మరోవైపు ప్రయాణికులపై భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీలో అద్దె బస్సులను ప్రవేశపెడుతామని ప్రకటించింది. రానున్న రోజుల్లో ఆర్టీసీలో సొంత బస్సులు ఉండే అవకాశమేలేదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రైవేటు యజమానులు ఒత్తిళ్ల, డిమాండ్లకు సంస్థ తలొగ్గాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మరిన్ని బస్సులు అద్దె ప్రాతిపదికన తీసుకుంటే ఆర్టీసీ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందనే కలవరపాటు సంస్థ అధికారులు, కార్మికవర్గాల్లో వ్యక్తమవుతోంది.

సగం అద్దె బస్సులే...

తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీ.. ప్రైవేటు హైర్ బస్సుల వైపు మొగ్గు చూపుతోంది. దాంతో యాజమాన్యంలోని సొంత బస్సుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. సొంత బస్సులను కొనలేని స్థితిలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేయడం ఆర్టీసీకి అనివార్యమైంది. దాంతో సంస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలనే ఆలోచనలో భాగంగా అద్దె ప్రాతిపదికన బస్సులను సమకూర్చుకుంటోంది. మెదక్, నర్సాపూర్ డిపో పరిధిలో సగానికిపైగా బస్సులు ప్రైవేట్‌వే కావడం గమనార్హం. ప్రయాణికులు అధికంగా ప్రయాణించే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అద్దెకు తీసుకున్నవే అధికంగా ఉన్నాయి. ఇది టీజీఎస్ ఆర్టీసీపై ప్రైవేటు బస్సుల ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తోంది.

మెదక్ డిపో పరిధిలో..

మెదక్ డిపో పరిధిలో మొత్తం 108 బస్సులు ఉండగా.. ఆర్టీసీ 53, అద్దె బస్సులు 55 ఉన్నాయి. ఇందులో 41 బస్సులు నిత్యం 30 వేల కిలోమీటర్ల ప్రయాణం చేస్తూ.. 60 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతోంది. వీటి ద్వారా రూ.20 లక్షల ఆదాయం సంస్థకు సమకూరుతోంది. అయితే 60 వేల మంది ప్రయాణికుల్లో 44 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. సంస్థలో అన్నివిభాగాల ఉద్యోగులు 328 మంది ఉన్నారు.

కార్మికవర్గాల్లో కలవరపాటు..

ప్రైవేటు బస్సులు పెరుగుతుండడం, కొత్త బస్సులు రాకపోవడం, నూతన డ్రైవర్ల నియామకం లేకపోవడం ఆర్టీసీ కార్మికవర్గాల్లో ఆందోళనకు కారణమవుతోంది. సొంత బస్సులను సమకూర్చుకునే విషయంతో ఆర్టీసీ యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తుండడంతో అద్దె బస్సుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందనే కలవరపాటు కార్మికులను తొలిచేస్తోంది. స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని హైర్ చేసుకోవాలని సర్కార్ భావిస్తోంది. ఈ విధంగా ప్రైవేటు బస్సుల సంఖ్య పెంచుతూపోతే సంస్థ మనుగడే ప్రశ్నార్థకమవుతుదని, ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతోందని కార్మిక సంఘాలు భావిస్తున్నాయి.

ఏడు కొత్త బస్సులు వచ్చాయి



ఆర్టీసీలో అద్దె బస్సులు కాకుండా సంస్థకు చెందిన కొత్త బస్సులు ఏడు వచ్చాయి. ప్రయాణికులు రద్దీ దృష్ట్యా అదనంగా కొత్త బస్సులను తీసుకొని.. మెరుగైన సేవలందించే దిశగా సంస్థ పాటుపడుతోంది.

- డీఎం సురేఖ

భద్రత ప్రశ్నార్థకం

అద్దె బస్సుల కంటే ప్రజలు ఆర్టీసీను ఎక్కువగా ఆదరిస్తారు. అయితే పలు సందర్భాల్లో ఆర్టీసీ బస్సులూ ప్రమాదాలకు గురవుతుండటం ప్రయాణికుల్లో గుబులు రేపుతోంది. హైర్ బస్సుల్లో ఆర్టీసీ కండక్లర్లను నియమిస్తుండగా.. డ్రైవర్లను ప్రైవేట్ యజమానులే నియమించుకోవాల్సి ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకుని అద్దె బస్సుల యజమానులు తక్కువ వేతనానికే అనుభవం తక్కువగా ఉన్న డ్రైవర్లను నియమించుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఆర్టీసీ సొంత డ్రైవర్ల కన్నా ప్రైవేట్ హైర్ బస్సులకు చెందిన డ్రైవర్లు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కారణం అవుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో అమాయకులు మృతి చెందుతుండుగా ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణంపై ప్రశ్నలు తలెత్తున్నాయి.

నల్లూరులో మైనింగ్, రెవెన్యూ అధికారుల పర్యటన



నల్లూరులో స్టోన్ క్రషర్ ఏర్పాటుపై స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

జిన్నారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్టోన్ క్రషర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నాలు, ఫిర్యాదులు చేయడంతో నల్లూరు గ్రామంలో మైనింగ్, రెవెన్యూ అధికారులు పర్యటించారు. గురువారం నల్లూరులో జిల్లా మైనింగ్ ఏడీ మధుసూదన్, తహసీల్దార్ భిక్షపతి పర్యటించి, స్థానికులతో సమావేశమయ్యారు. ఇటీవల స్థానిక 160 సర్వే నంబరులో నూతన స్టోన్ క్రషర్ ఏర్పాటు కోసం పనులు చేపట్టగా.. స్థానికులు అడ్డుకుని కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశంతో నల్లూరులో పర్యటించిన అధికారులు స్థానికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. స్టోన్ క్రషర్, క్వారీ ఏర్పాటుతో తమ గ్రామ పరిధిలోని పంట పొలాలు, నీటి వనరులు దెబ్బతింటాయని, గ్రామంలో నివాసాలకు పగుళ్లు ఏర్పడుతాయని, క్రషర్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యటనలో గ్రామస్థులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని జుబ్లీక్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బోనాఫైడ్, రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. ఎంపికలకు హాజరయ్యే వారు 2010 సెప్టెంబరు 1 నుంచి 2012 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు 16న హైదరాబాద్‌లో జరిగే అండర్-14 ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఐఐటీ బాంబే టెక్ ఫెస్ట్‌కు గీతం విద్యార్థులు

- అంతర్జాతీయ వేదికపై ఐదు మోడళ్లతో పోటీకి సిద్ధం






టెక్ ఫెస్ట్‌లో పోటీకి సిద్ధమైన ప్రాజెక్టులు

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓ అంతర్జాతీయ వేదికపై తమ ఇంజనీరింగ్ నైపుణ్యాలు, సృజనాత్మకతను ప్రదర్శించడానికి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే ఈనెల 17 నుంచి 19వ తేదీవరకు నిర్వహించనున్న టెక్ ఫెస్ట్ 2024లో తమ ప్రతిభను చాటేందుకు గీతం ఇన్నోవేషన్ సెంటర్‌కు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థుల బృందం తమ అత్యాధునిక ప్రాజెక్టులను ప్రదర్శించడానికి సిద్ధమవుతోంది. భారతీయ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలితీసి, వాటిని ప్రదర్శించడానికి ఓ వేదికను అందించే లక్ష్యంతో 1998లో ఐఐటీ బాంబే టెక్ ఫెస్ట్ శ్రీకారం చుట్టుకుని, ప్రపంచవ్యాప్తంగా పాల్గొనేవారిని ఆకర్షిస్తోంది. ఐక్యరాజ్య సమితి అంగాలైన యునెస్కో, యునిసెఫ్‌లతో పాటు సెంటర్ ఫర్ ఎన్విరాన్ మెంట్ ఎడ్యుకేషన్ (సీఈఈ) వంటి సంస్థల ప్రోత్సాహంతో, శాస్త్రీయ, సాంకేతిక పురోగతిని ప్రోత్సహిస్తోంది. గీతం ఐసీ బృందం ఐదు ఉత్తేజకరమైన కార్యక్రమాల్లో పోటీపడి, తమ ప్రాజెక్టుల ద్వారా ఇంజనీరింగ్ నైపుణ్యం, సృజనాత్మకతను ప్రదర్శించనుంది. వేగం, చురుకుదనం కోసం రూపొందించిన తేలికపాటి కార్బన్ ఫైబర్ డ్రోన్‌తో ఎఫ్‌పీవీ రేసింగ్, 8 సెన్సార్ ఐఆర్ శ్రేణిని కలిగి ఉన్న రోబోట్‌తో మెష్‌మెరైజ్, నిర్దిష్ట లక్ష్యం పోటీల కోసం రూపొందించిన బహుముఖ గ్రిప్పర్ రోబోట్‌తో కోజ్ మోక్లెంచ్, ఏరోమోడలింగ్ పోటీల కోసం రూపొందించిన నమూనాతో ఫిక్స్‌డ్ వింగ్ ఎయిర్ క్రాఫ్ట్ వెయ్యి కిలోవాట్ మోటారు, త్రీడీ ప్రింటెడ్ 35 మిల్లీమీటర్ల ప్రొపెల్లర్‌తో హైస్పీడ్ వాటర్ నావిగేషన్ బోట్‌తో రేసింగ్ వంటి 5 ప్రధాన విభాగాల్లో గీతం ఐసీ బృందం పోటీపడుతోంది. ఈ పోటీలకు సన్నద్ధమవుతున్న ఐసీ బృందాన్ని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్.రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్.శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఐఐటీ బాంబేలో అద్భుతమైన ప్రదర్శన చేయడం మాత్రమే కాకుండా అమూల్యమైన అనుభవాలు, బలమైన విశ్వవ్యాప్త పరిచయాలతో తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో గీతం విద్యార్థులు పాల్గొనడం, వాస్తవ ప్రపంచ సవాళ్లను స్వీకరించడానికి విద్యార్థులను సిద్ధం చేస్తూ, సాంకేతికతలో ఆవిష్కరణలు, శ్రేష్ఠతను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతను చాటిచెబుతోంది.

మాలధారణం.. నియమాల వర్తనం..

- ఏటేటా పెరుగుతున్న అయ్యప్ప మాలధారులు
- ఆధ్యాత్మికత వైపు యువత ఆసక్తి



పెద్దశంకరంపేటలోఅయ్యప్పస్వామి మాల ధరిస్తున్న దీక్షాధారులు

పెద్దశంకరంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలో ఏటేటా అయ్యప్ప మాల ధరించే వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం యువత ఆధ్యాత్మికత వైపు ఆసక్తి కనబరుస్తూ మాలలు ధరిస్తున్నారు. ఈ సంవత్సరం దాదాపు 200 మందిపైగా అయ్యప్పస్వాములు దీక్షధారణ చేయడం విశేషం. 41 రోజుల కఠిన దీక్ష అనంతరం కేరళ రాష్ట్రంలోని శబరిమలై తరలివెళ్లి స్వాములు కట్టుకున్న ఇరుముడులను అయ్యప్ప స్వామికి సమర్పించి, దర్శించుకున్నారు. పెద్దశంకరంపేటలో మాణిక్యప్రభు మందిరం, విఠలేశ్వర మందిరం, రేణుకా ఎల్లమ్మ, వేణుగోపాల స్వామి ఆలయాల్లో స్వాములు నివాసముంటూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అయ్యప్ప మండల దీక్షతో 41 రోజులు ఆధ్యాత్మిక చింతనతోపాటు దురవాట్లకు దూరమై సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలబడుతుంది. ఈ సందర్భంగా గురుస్వామి రామచంద్రచారి మాట్లాడుతూ 41 రోజులు కఠిన నియమాలతో దీక్ష చేయడం, సమయంలోపే ఆహారాన్ని స్వీకరించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. తాను 32 ఏళ్లుగా మాల ధరిస్తున్నానని చెప్పారు.

క్రైం కార్నర్

భవనం పైనుంచి పడి కస్తూర్బా విద్యార్థినికి గాయాలు

- దాచిన స్కూల్ యాజమాన్యం, ● ఘటనపై అనుమానాలు

రామాయంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాల భవనంపై నుంచి పడి విద్యార్థిని గాయాలైన సంఘటన మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగింది. గురువారం ఈ ఘటన జరగగా, పాఠశాల సిబ్బంది విషయాన్ని బయటకు రానివ్వలేదు. మొదట చిన్న గాయమైనని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అయితే, విద్యార్థిని ఎముకలు విరినట్లు తెలియడంతో గురువారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేట వడ్డెర కాలనీకి చెందిన రేణుక కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కొన్ని రోజుల నుంచి ఆమె గైర్హాజరు కాగా, రెండు రోజుల క్రితమే పాఠశాలకు వెళ్లింది. బుధవారం సాయంత్రం పై అంతస్థుపై దుస్తులు ఆరేసేందుకు వెళ్లి.. మెట్లపై నుంచి పడి కింది అంతస్థు వరకు దొర్లుతూ వచ్చినట్లు పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. గమనించిన వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. గురువారం ఉదయం వరకూ విద్యార్థిని ఆరోగ్యం కుదుట పడకపోవడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసి మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజనీలు గురువారం పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. ప్రిన్సిపాల్ విద్యార్థినితో పాటే ఆసుపత్రిలో ఉండటంతో పూర్తి వివరాలు తెలియరాలేదు.

గొర్రెను ఢీకొట్టిన బైక్, యువకుడి మృతి

వెల్దుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గొర్రెను బైక్ ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చర్లపల్లి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకున్నది. శివ్వంపేట మండలం పాంబండ గ్రామానికి చెందిన మానుక రాజు(27) వెల్దుర్తికి పని నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చర్లపల్లి గ్రామ శివారు వద్ద గొర్రె అడ్డురావడంతో గొర్రెను ఢీకొని అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ప్రమాదంలో గొర్రె కూడా మృతిచెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య నవనీత ఉన్నారు.

పాఠశాలలో మందుబాబుల వీరంగం



పాఠశాలలో చిందరవందరంగా పడేసిన సామగ్రి

నాగల్‌గిద్ద, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని కరస్‌గుత్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అర్ధరాత్రి మందుబాబులు వీరంగం సృష్టించారు. గురువారం ఉదయం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వచ్చేసరికి తరగతి గదుల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తరగతి గదిలో విద్యా సామగ్రి చిందరవందరగా పడేశారు. దీంతోపాటు పాఠశాల టేబుల్స్ మీద మద్యం సీసాలు లభ్యమవడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులు వీరమన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

‘సమగ్రశిక్ష’ ఉద్యోగుల పోరుబాట

- నేటి నుంచి రిలే దీక్ష, నిరవధిక సమ్మెలు
- ఈసారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె యథాతథం
- ఉన్నతాధికారులు, డీఈవోకు సమ్మె నోటీసులు



సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా గతేడాది సెప్టెంబరు 4 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక నిరసన దీక్షలు చేపట్టారు. 25 రోజుల పాటు కలెక్టరేట్ల వద్ద ఉద్యోగులు దీక్షలు చేశారు. గతేడాది సెప్టెంబరు 13న వరంగల్‌లో చేపట్టిన దీక్ష శిబిరం వద్దకు ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి టీపీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి వచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలకు సంబంధించి ‘టీ’ తాగినంత సేపట్లో జీవో ఇస్తానని ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు సమస్యలకు సీఎం పరిష్కారం చూపలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి పోరుబాట

పాఠశాల విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు ఈ నెల 6 నుంచి మరోసారి పోరుబాటకు సిద్ధమయ్యారు. 6,7వ తేదీల్లో రిలే దీక్షలు, ప్రభుత్వం స్పందించకుంటే 9వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలకు వెళ్లనున్నారు. ఇప్పటికే విద్యాశాఖ సమగ్ర శిక్ష రాష్ట్ర ఉన్నతాధికారులు, డీఈవో వెంకటేశ్వర్లుకు పదిరోజుల కిందటే సమ్మె నోటీసు అందజేశారు. 15 రోజుల్లో సమస్యలకు పరిష్కారం చూపకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.

సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



గతేడాది నిరసన దీక్ష సమయంలో రేవంత్‌రెడ్డి న్యాయం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి 11 నెలలు గడుస్తోంది. ఇప్పటివరకు తమ సమస్యలు పరిష్కరించలేదు. పలుమార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించి వస్తున్నాం. స్పందన లేకపోవడంతో సమ్మెలో వెళ్లాలని నిర్ణయించాం. సుమారు 18 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నాం. సీఎం ఇచ్చిన హామీ ప్రకారం క్రమబద్ధీకరించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలి.

- మరెల్లి దత్తు, సీఆర్పీల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో 686 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు

సమగ్ర శిక్ష అభియాన్ కింద సంగారెడ్డి జిల్లాలో 686 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. వారిలో డీపీవో స్టాఫ్-10 మంది, కేజీబీవీల్లో-324 మంది,(అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్) యూఆర్ఎస్ -13 మంది, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు-19 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు-23 మంది, ఐఈఆర్‌పీలు-34 మంది, సీఆర్పీలు-111, మెసెంజర్లు-17, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు(పీటీఐలు)-103, సీజీవీఎస్(కేర్ గివర్ వాలంటీర్స్)-24 మంది పనిచేస్తున్నారు. విద్యాభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడంలో వీరు కీలకంగా వ్యవహరిస్తారు.

కేజీబీవీలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జిన్నారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. స్థానికంగా పాఠశాలలో ఫిజికల్ సైన్సు టీచర్ పోస్టు ఖాళీగా ఉందని, గుమ్మడిదల కేజీబీవీలో ఖాళీగా ఉన్న పీఈటీ ఉద్యోగానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

● వట్‌పల్లి, డిసెంబరు 5.(ఆంధ్రజ్యోతి) వట్‌పల్లిలోని (అందోల్) కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అతిథి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వట్‌పల్లి మండల విద్యాధికారి గోవింద్ రెడ్డి, ఎస్‌వో పరమేశ్వర్ గురువారం తెలిపారు. వట్‌పల్లికి సంబంధించిన కేజీబీవీ అందోల్‌లో నిర్వహిస్తున్న ఈ విద్యాలయంలో సీఆర్టీ హిందీ, ఇంగ్లిష్, సీఆర్టీ పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

బాబోయ్.. ఇదేం రోడ్డు?

● ఇరుకు రోడ్డు, మూలమలుపులతో తప్పని ఇక్కట్లు

రేగోడు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసలే ఇరుకు రోడ్డు.. ఆపై ప్రమాదకరమైన మూలమలుపులు వాహనదారులకు పాలిట ఇబ్బందిగా మారాయి. దీంతో రేగోడు - అల్లాదుర్గం రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. రేగోడు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మూలమలుపులకు తోడు రోడ్డుకిరువైపులా ఏపుగా పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొండాపూర్ - జగిర్యాల చెరువు కట్ట కింద రోడ్డు ఇరుకుగా మారింది. రోడ్డు పక్కనే గుంతలు ఎదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలకు గురవుతున్నాయి. రేగోడు - అల్లాదుర్గం రోడ్డుకు ఇరువైపులా మొరం లేకపోవడం, గుంతలు పడిన పూడ్చకపోవడం, రోడ్డుపై పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు పెరిగిపోవడంతో పాటు కనీసం సూచికబోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడం వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా పరిణమించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే రోడ్డుకిరువైపులా మొరం వేయించి, పిచ్చి మొక్కలను తొలగించి, మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రేగోడు - అల్లాదుర్గం రోడ్డుపై ప్రమాదకర మూల మలుపువద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలమేళా



బాలా మేళాలో ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తదితరులు

నర్సాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలలో భాగంగా గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలమేళా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, ఆర్డీవో మహిపాల్, డీడబ్ల్యూవో స్వరూపరాథోడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలకు, చిన్నపిల్లలకు అందిస్తున్న పౌష్టికహారంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో హేమభార్గవి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మాధవిలత, కమిషనర్ రామకృష్ణరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఖేడ్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

నారాయణఖేడ్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖేడ్ పురపాలక పరిధిలోని కరుస్‌గుత్తి రోడ్ నుంచి కంగ్టి రోడ్‌లోని 3 కిలోమీటర్ల ఫార్మేషన్ బైపాస్‌రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. పట్టణంలోని పలు కాలనీలో పర్యటించి ప్రజలతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నియోజక వర్గంలోని నారాయణఖేడ్, నిజాంపేట తదితర మండలాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్, కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు ఉన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: మెదక్ కలెక్టర్

● పలు మండలాల్లో ప్రజాపాలన విజయోత్సవాలు



మెదక్ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



సంగారెడ్డి డిపోలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మెదక్ అర్బన్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం బస్టాండ్ ప్రాంగణంలో మహాలక్ష్మి పథకం అమలుపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కోటి 60 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి రూ.53 కోట్ల మేరకు ఆదా చేసుకున్నారన్నారు. మహిళా శక్తి ద్వారా రుణాలు మంజూరు చేసిన వారితో ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అంతకుముందు బస్సుల్లో ప్రయాణించి లక్కీ డిప్‌లో గెలుపొందిన మహిళలకు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ శాలువాలు, ఫ్రీగిఫ్ట్‌లతో సన్మానించారు. అనంతరం ఆర్టీసీ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అంజనేయులు, డీఎం సురేఖ, ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

● చేగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం నార్సింగి మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ అధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంఘాలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళాశక్తి ద్వారా మెదక్ జిల్లాలో రూ.100 కోట్ల రుణాలు ఇవ్వడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అనంతరం సంఖపూర్‌లో ఏర్పాటు చేసిన నాటు కోళ్ల పరిశ్రమను పరిశీలించారు.

ఉచిత బస్సుతో మహిళల్లో సంతోషం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సుతో మహిళలు సంతోషంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు హయాంలో ఏడాది కాలంగా మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యం పొందుతున్నారని గుర్తు చేశారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ ఆర్‌ఎం ప్రభులత మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకం ద్వారా జిల్లాలో 1.85 కోట్ల మంది మహిళా ప్రయాణికులు రూ.83.89 కోట్ల టికెట్ చార్జీలు ఆదా చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో డీఎం ఉపేందర్, సువర్ణబాయి, రాజు, హన్మంతు, అహ్మద్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి

హవేళిఘణపూర్, డిసెంబరు5.(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్‌లోని కూరగాయలు, ఇతర వస్తువులను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

● వట్‌పల్లి, డిసెంబరు 5.(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్వట్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో శశిప్రభ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమయ పాలన పాటించాలని పలు జాగ్రత్తలను సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

కేజీబీవీని సందర్శించిన బీఆర్‌ఎస్ శ్రేణులు

అల్లాదుర్గం, డిసెంబరు 5.(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ అల్లాదుర్గం మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింలు, జాగృతి జిల్లా కన్వీనర్ కృష్ణాగౌడ్ సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు రుచితో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని వసతి గృహాల వార్డన్లకు, ఎస్‌వోలకు సూచించారు.

ఏడాది పాలనపై ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?

(3వ పేజీ తరువాయి)

అధ్యక్షుడు శేఖర్, రమణాగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, సంతోష్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, జ్ఞానేశ్వర్, ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీసుస్టేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది దుర్మార్గపు పాలనపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ అయ్యిందని, ఇక నుంచైనా పోలీసుల పనితీరు మార్చుకోవాలన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి శాశ్వతం కాదని, ఆయన పతనం మొదలైందని, వెయ్యి మంది రేవంత్‌రెడ్డిలు ఒక్కటైనా బీఆర్‌ఎస్ పార్టీని ఏమి చేయలేరన్నారు. ఎంత అణిచివేయాలని చూస్తే అంత తిరుగుబాటు లేస్తుందని, ఖబర్దార్ రేవంత్ అంటూ ఆయన హెచ్చరించారు.

ఘనంగా మంత్రి దామోదర్ జన్మదిన వేడుకలు



వట్‌పల్లిలో మంత్రి జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

వట్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు కూతురు త్రిష జన్మదినోత్సవ వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు గురువారం వట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. యువజనకాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అరుణార్థి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

మెదక్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అరుణార్థి వెంకటరమణ కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. ఆయన తల్లి భూలక్ష్మి ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆయన ఇంటికి వచ్చి.. భూలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మనోహరాబాద్ తాజా మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకుడు బోస్, మధు, సురేందర్, మేడి గణేష్, కోనాపూర్ సాగర్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ కౌన్సిలర్ అంజనేయులు, అందు కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

పుల్‌కల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న క్రీడోత్సవాలు గురువారం ముగిశాయి. కళాశాలలో విద్యనభ్యసిస్తూ అకాల మరణం పొందిన విద్యార్థి రాజ్‌కుమార్ నాయక్ జ్ఞాపకార్థం గత నాలుగు రోజులుగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మదుపతి త్రిశూల్ పర్యవేక్షణలో వాలీబాల్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కళాశాలలోని ఈసీఈ, సీఎస్ఈ, సివిల్, మెకానికల్ విభాగాలకు చెందిన విద్యార్థుల జట్లు పాల్గొన్నాయి. విజేత జట్లకు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిని మెకానికల్, రెండో బహుమతిని సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల జట్లు గెలుపొందారు.

'సీఎం కప్' విజయవంతం చేయాలి

తూప్రాన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని జడ్పీ సీఈవో మండల ప్రత్యేక అధికారి ఎల్లయ్య పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ ఎంపీడీవో కార్యాలయంలో సీఎం కప్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ఈనెల 7,8న అథ్లెటిక్స్, ఫుట్ బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా క్రీడా పోటీలు నిర్వహించడానికి నిర్ణయించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు 10, 11, 12లలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి నిర్ణయించారు. మండల స్థాయి పోటీలు ఘనపూర్‌లో నిర్వహించడానికి తీర్మాణించారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

పాపన్నపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువుల పెంపకం, పోషణలో తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇన్‌చార్జి పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. గురువారం మండలంలోని ఎల్లాపూర్‌లో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సరైన సమయంలో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించి మేలు జాతి దూడలను పొందాలని సూచించారు. దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. పశు సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

కాంగ్రెస్ ప్రజలే బుద్ధిచెబుతారు: బీజేపీ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ మోసాలపై ప్రతీ కార్యకర్త కంకణబద్దులై ఎండగట్టాలని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని అంబేద్కర్ చౌక్ వద్ద 'కాంగ్రెస్ 6 గ్యారెంటీలు, 66 మోసాలు'పై చార్జీషీట్ విడుదల సందర్భంగా గురువారం రాత్రి సభ ఏర్పాటు చేశారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ గ్యారెంటీలతో గారడీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు బీజేపీ ప్రజల పక్షాన ఉంటూ నిరంతరం పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. అంతకుముందు పట్టణ అధ్యక్షుడు ద్వారకా రవి ఆధ్వర్యంలో పీఎస్ఆర్ గార్డెన్స్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

● మెదక్‌అర్బన్/ రామాయంపేట, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ది గ్యారెంటీల గారడీ అని, 6 గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు డా. మురళీధర్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై గురువారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన బీజేపీ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు స్థానిక రాందాస్ చౌరస్తా నుంచి గార్డెన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్, నాయకులు పాల్గొన్నారు. అబద్దపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని ఆరోపిస్తూ రామాయంపేటలో బీజేపీ భారీ బైక్ ర్యాలీ చేపట్టింది.

ప్రశ్నించే గొంతులు నొక్కడం సరికాదు: బీఆర్‌ఎస్



నార్సింగిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హత్నూర/నారాయణఖేడ్/కోహీర్/తూప్రాన్/చేగుంట/పాపన్నపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అసమర్థత విధానాలను ప్రశ్నించేవారిని అరెస్టు చేసి గొంతు నొక్కడమే ప్రజా పాలనా అని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కలవడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసి మూడు గంటలు దాటినా పోలీసుల నుంచి ఎలాంటి వివరణ లేకపోవడంతో గురువారం అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ ఉమ్మన్నగారి దేవేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. పోలీసుల తీరును తప్పుపడుతూ.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, కేసీఆర్ నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఖేడ్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలను ఎదుర్కొనలేకే ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని విమర్శించారు. కోహీర్ మండలకేంద్రంలో పీచేర్యాగడి సొసైటీ చైర్మన్ స్రవంతి అరవింద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేకుండానే బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేస్తుందని విమర్శించారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతులు నొక్కలేరని పేర్కొన్నారు. హరీశ్‌రావును బేషరతుగా విడుదల చేయకుంటే ఆందోళనలు చేస్తామని, రేపు తూప్రాన్ బంద్ నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బొలంపల్లి బాబుల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకే ప్రశ్నించే గొంతులను నొక్కేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని చేగుంట మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడుకొమండ్ల నారాయణ రెడ్డి అన్నారు. పాపన్నపేట మండలంలోని ఏడుపాయల కమాన్ వద్ద మెదక్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తప్పుడు ఫిర్యాదుతో హరీశ్‌రావును అరెస్టు చేయడం సరికాదని హెచ్చరించారు. కాగా హరీశ్‌రావును అక్రమంగా అరెస్టుచేశారని నిరసిస్తూ నార్సింగి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్వర్యంలో 44వ జాతీయరహదారిపై గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాబు, మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ సబిత, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ గుడి పునర్నిర్మాణానికి పూజ



రంగాయపల్లి లోని హనుమాన్ ఆలయం భూమిపూజలో గ్రామస్థులు

మనోహరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయ నూతన పునర్నిర్మాణ పూజను మాజీ వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగాయపల్లి గ్రామంలో పురాతన ఆలయం ఉంది. గ్రామస్థులు ఆలయం పునర్నిర్మాణం చేయాలని భావిస్తుండగా, అందుకయ్యే ఖర్చును పూర్తిగా తాను భరిస్తానని మాజీ వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి ముందుకొచ్చారు. దీంతో గురువారం వేద పండితులు రాములు శర్మ ఆధ్వర్యంలో ఆలయం గడప పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పాల అశోక్, నరసింహ స్వామి, శేఖర్, కుమార్, నాగరాజు, కిషోర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సమ్మె నోటీసు అందజేత

చిన్నశంకరంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎంఈఓ పుష్పవేణికి సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ నెల 10 నుంచి సమ్మెకు వెళ్తున్నామని రిప్రజెంటేషన్ ఇస్తున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల మండల జాక్ అధ్యక్షుడు ప్రతాప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, చనిపోయిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తదితర డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. అదేవిధంగా సమస్యల పరిష్కారానికి గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని తప్పారన్నారు. సమ్మె నోటీసు అందజేసినవారిలో సీఆర్పీలు సందీప్ అంజనేయులు, కేజీబీవీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

హస్తకళ ఫ్యాక్టరీని సందర్శించిన విద్యార్థులు

గుమ్మడిదల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బొంతపల్లి సమీపంలోని హస్తకళల ఫ్యాక్టరీని గురువారం జడ్పీ హైస్కూల్ బొంతపల్లి విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. ఈ ప్రదర్శనలో చెక్కతో తయారు చేసిన బొమ్మల గొప్పతనం కళాకారుల పనితనాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల మేనేజర్ మసూద్ హైదరాబాద్ హాజరయ్యారు. అలాగే స్థానిక ఎంఈవో రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు విశ్వనాథ్, ఏసు పాదం, సంపత్ అలాగే 60 మంది విద్యార్థిని విద్యార్థులకు హస్తకలపై వ్యాసరచన పోటీలు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు కొయ్య బొమ్మలు అందమైన చేత్తో తయారైన బొమ్మలను బహుమతిగా విద్యార్థులకు అందించారు.

బొంతపల్లి పాఠశాలలో దివ్యాంగులకు అవగాహన

గుమ్మడిదల డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బొంతపల్లి పాఠశాలలో జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వారికి స్ఫూర్తిదాయకమైన జీవితాలను పరిచయం చేయడానికి దోమడుగు బొంతపల్లి పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులకు స్ఫూర్తిదాయకమైన ఆలోచన విధానాన్ని తెలియజేస్తూ ఎంఈవో రాంబాబు జిల్లా దివ్యాంగుల వైస్ ప్రెసిడెంట్ నరసింహులు పాఠశాలకు విచ్చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. వారికి బాసటగా నిలుస్తానని జిల్లా వైస్ ప్రెసిడెంట్ నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, విశ్వనాథ్, విశ్వపాదం, సంపత్ మొదలైన ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో రైతులకు గురువారం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భావితరాలకు సారవంతమైన నేల అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు తప్పనిసరిగా భూసారపరీక్షలు చేయించుకోవాలని సూచించారు.



సంగారెడ్డిలోని ఎఫ్‌ఆర్‌ఎస్‌ను సందర్శించిన విద్యార్థులు



కౌడిపల్లిలో రైతులకు భూసార పరీక్షల పత్రాలను అందజేస్తున్న దృశ్యం



జహీరాబాద్: రంజోల్ రైతువేదికలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా.రాజమణి తదితరులు

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రాన్ని గురువారం సిల్వర్ డాక్ పాఠశాల, క్రీడా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. విద్యార్థులకు ఎఫ్‌ఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు భూసార పరిరక్షణతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఎస్ ఇన్‌చార్జి డా. స్నేహిత, డా.మాధవి, హరికాంత్, మైనిక, నితీష్, విద్యార్థులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ గ్రామంలో గల రైతువేదికలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.శంకర్, శుక్రుత్‌కుమార్, రాజమణి, సరిత, మండల వ్యవసాయాధికారి లావణ్య మాట్లాడుతూ.. రైతులు సాధ్యమైనంత వరకు రైతులు పొలాల్లో సేంద్రియ ఎరువులను మాత్రమే వాడాలని, అధికారులు సిఫారసు చేసిన మోతాదుల్లోనే రసాయన ఎరువులను వాడాలని సూచించారు. నేల కోతకు గురికాకుండా వాలుకు అడ్డంగా దుక్కులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రంజోల్ గ్రామంలో ర్యాలీలు నిర్వహించారు.

వివిధ మండలాల్లో..

చేగుంట/మాసాయిపేట/వెల్దుర్తి/కౌడిపల్లి/నర్సాపూర్/చిలప్‌చెడ్/హవేళిఘణపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నార్సింగి మండలం నర్సంపల్లి తండాలో రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్ నారాయణ రైతులకు నేల సంరక్షణ పద్దతులు, ఎరువులు వాడకం వంటి అంశాలపైన అవగాహన కల్పించారు. చేగుంట మండలంలోని రుక్మాపూర్‌లో గ్రామంలో వ్యవసాయ అధికారి హరిప్రసాద్ రైతులకు నేల రకాలు, నేల సారవంతం సేంద్రియ ఎరువుల వాడకం పచ్చిరొట్టె వాడకంపై అవగాహన కల్పించారు. మాసాయిపేట రైతు వేదికలో ఏవో రామ శివరావు ఆధ్వర్యంలో రైతులతో అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నేలల ప్రాధాన్యాన్ని గ్రహించి సేంద్రియ ఎరువులను వాడుతూ ఆరోగ్యకరమైన పంటలను పండించాలని సూచించారు. వెల్దుర్తి మండలంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వ్యవసాయ అధికారి ఝాన్సీ మాట్లాడుతూ పొలాల్లో వరి కొయ్యలను తగలబెట్టకుండా పొలాన్ని దున్ని ఎస్ఎస్పీ వాడి కొయ్యలను కుల్లబెట్టి పొలాన్ని తయారు చేసుకోవాలని తెలిపారు. కౌడిపలి మండల పరిధిలోని తునికిలోని డాక్టర్ డి, రామానాయుడు వ్యవసాయ విజ్ఞానజ్యోతి, కేవీకే(కృషి విజ్ఞాన జ్యోతి)లో రామానాయుడు కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నేల ప్రాముఖ్యతను తెలియజేస్తూ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎస్‌డీ నల్కర్ మాట్లడుతు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. నర్సాపూర్ రైతువేదికలో రైతులకు నిర్వహించిన అవగాహనలో ఏడీఏ సంధ్యరాణి మాట్లాడుతూ నేలల రకాలు, వాటి స్వభావం, నేలలో సహజ సూక్ష్మ జీవుల సంరక్షణ, జీవ, సేంద్రియ ఎరువుల వాడకం నేల పరిరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో చంద్రవేణి, రవివర్మ తదితరులు పాల్గొన్నారు. చిలప్‌చెడ్ రైతు వేదికలో భూసార సంరక్షణ పై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏవో రాజశేఖర్ మాట్లాడుతూ.. భూసారాన్ని కాపాడుకోవాలంటే రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. హవేళిఘణపూర్ మండలం చౌట్లపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి బాల్ రెడ్డి రైతులకు నేలల రకాలు, భూసారం పెంపు పద్దతుల, గూర్చి అవగాహన కల్పించారు.